ప్రజాశక్తి

సోమవారం 11 సెప్టెంబర్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ఏ ప్రభుత్వం వచ్చినా..

జిల్లాకు అన్యాయమే..

- సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు
- దొనకొండలో సిపిఎం పోరుబాట పాదయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-దొనకొండ

ప్రకాశం జిల్లాకు, దొనకొండ ప్రాంతానికి ఏ ప్రభుత్వం వచ్చినా అన్యాయం జరుగుతోందని సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పెనుమల్లి మధు తెలిపారు. సిపిఎం పోరుబాట పాదయాత్రను ఆయన దొనకొండలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన దొనకొండ బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని, దీని అభివృద్ధికి రూ.10 వేల కోట్ల ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించాలనే నినాదంతో ఈ నెల 23 వరకు 14 రోజుల పాటు 300 కిలోమీటర్లు 10 మంది సభ్యులతో పాదయాత్ర ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత దొనకొండ రాజధానిగా శ్రీక్రిష్ణ కమిటీ నివేదిక సమర్పించిందన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా దొనకొండలో ప్రభుత్వ భూములు 25 వేల ఎకరాలు ఉండటంతో ఇక్కడ అనువుగా ఉంటుందని ఆ కమిటీ తెలిపిందన్నారు. కానీ అప్పటి ప్రభుత్వం గుంటూరు, విజయవాడ ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించి దొనకొండను పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని, నిరుద్యోగ సమస్య నిర్మూలిస్తామని అప్పటి నాయకులు మాటలు చెప్పి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతం ఎంతో వెనుకబడిందని, ఇప్పటికైనా ఈ ప్రాంతం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు వచ్చినా ప్రకాశం జిల్లాను పట్టించుకోవటం లేదన్నారు. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్‌తో అభివృద్ధి చేస్తామని మాటలతోనే కాలం వెల్లబుచ్చారన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా రాష్ట్రంలోనే మారుమూల జిల్లా అయిందని, అభివృద్ధికి నోచుకోవటం లేదన్నారు. డబ్బు ఉన్న వారే నాయకులు అయిపోతున్నారని, తరతరాలుగా వారు, వారి పిల్లలే రాజకీయంగా ఎదుగుతున్నారే తప్ప ప్రజల అభివృద్ధిని ఎవరూ కోరుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి ప్రకాశం జిల్లా అభివృద్ధి చెందేలా చర్యలు ▶ 2లో



పోరుబాట పాదయాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు

చంద్రబాబుపై ఇంకా ఐదారు కేసులున్నాయి..

వైసిపి సీనియర్ నేత విజయసాయిరెడ్డి వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మాజీ సిఎం చంద్రబాబు చేసిన అక్రమాలపై మరో ఐదారు కేసులున్నాయని, జ్యుడిషియల్ రిమాండే కాకుండా పోలీసు రిమాండ్ కూడా ఉంటుందని వైసిపి ఎంపీ, ఆ పార్టీ సీనియర్ నేత విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఆదివారం సాయంత్రం ఒంగోలు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తన పాలనలో చట్టాన్ని అతిక్రమించి ఎన్ని తప్పులు చేసినా తప్పించుకోవచ్చనే ధృడ అభిప్రాయంలో ఉన్నారన్నారు. ప్రజల సొమ్మును దోచుకోవడంపై ఆధారాలతో సహా కేసు పెట్టినందునే ఆయన తప్పించుకునే పరిస్థితి లేదన్నారు. ఆయనపై కేసులు పెట్టడంలో రాజకీయ ఉద్దేశాలు ఏమీ లేవన్నారు. ఆయనతో పాటు ఈనాడు అధినేత చెరుకూరి రామోజీరావు కూడా ఉన్నారని, ప్రస్తుతం సుప్రీంకోర్టు వరకూ వెళ్లి తాత్కాలికంగా తప్పించుకున్నారన్నారు. ఆయనపైనా కేసులుంటాయన్నారు.



జనవిజ్ఞానవేదిక నూతన రాష్ట్ర కమిటీ ఇదే..

సైన్స్ ఫలితాలను సైతం

రాజకీయాలకు ఉపయోగించుకోవడం దుర్మార్గం

- జనవిజ్ఞానవేదిక మహాసభలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు
- 74 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక

▲ 8లో

నిర్బంధం..నిరసనల పర్వం..

- చంద్రబాబుకు రిమాండ్‌తో డీలాపడ్డ తెలుగు తమ్ముళ్లు
- కొనసాగిన నేతల దీక్షలు
- నేడు టిడిపి ఆధ్వర్యంలో బంద్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పార్టీ పిలుపు మేరకు ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఆ పార్టీ శ్రేణులు నిరసనదీక్షలు చేపట్టారు. పోలీసులు దీక్షాశిబిరాలను భగ్నం చేశారు. నిరసనలు జరపకుండా అడ్డుకునే యత్నం చేశారు. అయినా పలుచోట్ల వివిధ రూపాల్లో తెలుగుదేశం శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించడంతో తెలుగు తమ్ముళ్లు డీలా పడ్డారు. చంద్రబాబుకు రిమాండ్ విధించినందుకు నిరసనగా సోమవారం టిడిపి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బంద్ చేపట్టనున్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆదివారం కూడా టిడిపి శ్రేణులు దీక్షలను కొనసాగించాయి. మార్కా పురం, కొండపిలో దీక్షా శిబిరాలపై పోలీసులు దాడి చేసి.. టెంట్లు పీకేశారు. కార్యకర్తలను అరెస్టు చేశారు. గన్నవరం ఎయిర్‌పోర్టు లో అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను పోలీసులు వదిలి పెట్టలేదు. నియోజకవర్గాల్లోకి రాకుండా నిర్బంధించారు. వాళ్లు విజయవాడలోనే ఉన్నారు. కొండపి ఎమ్మెల్యే స్వామి కూడా గృహ నిర్బంధంలోనే ఉన్నారు. మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు అందరూ ఇళ్లలోనే ఉన్నారు. ఎవరినీ బయటకు రానివ్వ లేదు. మండల స్థాయి నేతలదీ ఇదే పరిస్థితి. పోలీసుల నిర్బంధాలను ఎదిరించి పలుచోట్ల నిరసనలు చేపట్టారు. కొందరు నేతలు ఇళ్ల నుంచే నిరసన కార్యక్రమాలు కొనసాగించారు. ఒంగోలులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద దీక్షకు పోలీసులు అనుమతించలేదు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన నిరసన దీక్షల్లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్ పాల్గొన్నారు. మెడలో నల్లకండువా వేసుకుని దీక్షా శిబిరంలో కూర్చున్నారు. సిఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడే ఆందోళనలు చేపట్టారు. నిరసనలకు పోలీసులు అనుమతింకపోవడంతో ఇళ్ల నుంచి, పార్టీ కార్యాలయాల నుంచి చేపట్టారు. పోలీసులు మాత్రం తెలుగుదేశం కార్యకర్తలు, నేతలను కదలనీయకుండా గట్టి చర్యలు చేపట్టారు. చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకున్న తరుణంలో లాఠీఛార్జి చేసిన విషయం తెలిసిందే.. పోలీసులు కఠినంగానే వ్యవహరించారు. ఇక చంద్రబాబు సిఐడి కోర్టుకు హాజరుపరచగా ఆదివారం సాయంత్రం కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. దీంతో తెలుగు తమ్ముళ్లు డీలా పడ్డారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా టిడిపి ఆధ్వర్యంలో బంద్ చేపట్టనున్నారు.



ఒంగోలులో నిరసన తెలుపుతున్న దామచర్ల జనార్ధన్, టిడిపి నేతలు



బాపట్లలో టిడిపి నేతల ఆందోళనను అడ్డుకుంటున్న పోలీసులు

ఉపాధి పనులలో అవకతవకలు

- మస్టర్లు సక్రమంగా వేయని వైనం
- ఎంబుక్‌లో నమోదు చేయకుండానే కూలీలకు వేతనాలు చెల్లింపు
- సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడి



సామాజిక తనిఖీల ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఉపాధి హామీ పనుల్లో పలు అవకతవకులు జరిగినట్లు సామాజిక తనిఖీ ప్రజావేదిక అధికారుల బందం గుర్తించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 వరకు చేసిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం పీడీ శీనారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మండలంలో 1119 పనులు గానూ 19,80,23,544 కోట్లు నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇజిసి, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, సోషల్ ఫారెస్ట్ ద్వారా చేపట్టిన పనులపై గత నెల 27 నుంచి ఈ నెల 9 వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామాలలో గ్రామసభలు ఏర్పాటు చేసి నివేదికలు వివరించినట్లు ఎస్ఆర్‌పి సుబ్బారావు తెలిపారు. మస్టర్ లేకుండా పని ప్రదేశంలో నేమ్ బోర్డు లేకుండా బిల్లులు చెల్లించినట్లు గుర్తించారు. పెదరికట్ల గ్రామంలో రెండు పక్కా గహాలు మంజూరు కాగా ఒకటి మాత్రమే నిర్మించి రెండిటికి బిల్లు చేసినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది. పని ప్రదేశంలో పనికి పనికి సంబంధించిన నేమ్ బోర్డులు ఏర్పాటు చేయక పోవటం ఏమిటని పీడీ ప్రశ్నించారు. ఎంబుక్కులో అధికారులు సంతకాలు లేకుండా బిల్లులు చెల్లింపు చేయటం ఏమిటని ఎన్‌ఆర్‌ఇజిఎస్ సిబ్బందిని నిలదీశారు ఈ సందర్భంగా పీడీ సీనారెడ్డి మాట్లాడుతూ పనులకు సంబంధించిన బోర్డులను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. మస్టర్లు సక్రమంగా నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటం ఏమిటని సిబ్బందిపై మండిపడ్డారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఏడుకొండలు జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ రాణి, ఎంపిడిఒ శ్రీనివాసమూర్తి, ఏపీడీ పద్మావతి ఎస్ఆర్‌పి సుబ్బారావు, ఎపిఒలు బులెన్‌రావు, రవిబాబు, డిఆర్‌పిలు, ఇసిలు, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

ఏ ప్రభుత్వం వచ్చినా జిల్లాకు అన్యాయమే..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలన్నారు. సిపిఎం పోరుబాట పాదయాత్రలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, వెల్లంపల్లి ఆంజనేయులు, పార్టీ సభ్యులు కె.రమాదేవి, పి.కల్పన, బి.రఘురామ్, వి.బాలకోటయ్య, డికెయం రఫీ, కె.మాల్యాద్రి, సిహెచ్.వినోద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తాండవ రంగారావు, సందు వెంకటేశ్వర్లు, యం.రమేష్, మాబు, కర్నా హనుమయ్య, గుడిమెట్ల ఆదాము, కటికల రాజయ్య, రమేష్, బాబు, వెంకట్రావు, పి.గురవయ్య, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోరుమామిళ్ళ సుబ్బరాయుడు

ఔవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి : పోరుమామిళ్ల

ప్రజాశక్తి-మార్కాపురం

రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, మరోవైపు చాలిచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు విమర్శించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక పూలసుబ్బయ్య శాంతి యూనియన్ జిల్లా అధ్యక్షుడు అందే నాసరయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ తాము అధికారం లోకి వస్తే అవుసోర్సింగ్‌లో పని చేసే కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తాన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇంత వరకూ నెరవేరలేదని తెలిపారు. మున్సిపల్ కార్మికులకు సబ్బులు, నూనె, దస్తులు, పాదరక్షలు నేటికీ ఇవ్వలేదన్నారు. మతి చెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ అధికారులు అమలు చేయడం లేదని విమర్శించారు. మార్కాపురం మున్సిపాలిటీలో మొత్తం తొమ్మిది మంది కార్మికులు మతి చెందగా వారి స్థానంలో ఏ ఒక్కరికి నేటికీ కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా మతి చెందిన వారి కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి ఉద్యోగాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమమే తమ సంక్షేమమని పదేపదే ప్రకటించే మంత్రులు ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని కావున భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన కార్మికుల లోకానికి పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్మిక హక్కుల కు భంగం కలిగించే విధంగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, అందులో భాగంగానే కార్మిక చట్టాల్లో అనేక మార్పులు తీసుకొస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. అందులో భాగంగా లాభాలతో నడుస్తున్న ఎల్ఐసి, రైల్వేలు, పౌర విమానయాన శాఖ, బిఎస్ఎన్ఎల్, హిందుస్థాన్ పెట్రోలియం కెమికల్స్, గంగవరం, శ్రీకష్ణపట్నం పోర్టు తదితర లక్షల కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం అంబానీ, ఆదానీలకు కారు చౌకగా విక్రయిస్తూ ప్రజా సంపదను దుర్వినియోగం చేస్తుందని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.హరిబాబు, సహాయ కార్యదర్శి మేకా వెంకటేశ్వర్లు, నాసర్ వలి,నాయకులు గుజ్జుల బాలి రెడ్డి, ఈర్మియ, నియోజక వర్గ ఎఐటియుసి అధ్యక్షులు ఏలూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కెటిసి పాపారాయుడుకు..

సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు

ప్రజాశక్తి -కనిగిరి

ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియాలోని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా , కేరళ, కర్ణాటక, తమిళ నాడు రాష్ట్రాలలోని స్కూల్ మరియు కాలేజీల్లో ఉన్నత విలువలతో విద్యను అందించిన 450 మంది ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్లకు స్థానిక గుంటూరులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అవార్డులు ప్రదానం చేశారు. కనిగిరిలోని కెటిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కెటిసి. పాపారాయుడు అర్థమెటిక్, రీజనింగ్, మాథెమాటిక్స్‌లో అత్యుత్తమ సేవలు అందించినందుకు సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు -2023 అందజేసి సత్కరించారు. హైదరాబాద్ కలెక్టర్ శ్రీకాంత్, గుంటూరు ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, ఎపి ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ రామనాథం , ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఈదా శామ్యూల్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత పాపా రాయుడును పలువురు అభినందించారు.



అవార్డు అనుకుంటున్న పాపారాయుడు

'చదవడం నాకిష్టం'

టంగుటూరు : స్థానిక గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకుడు గుమ్మడి వర్ధన రాజు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి తమ నచ్చిన సబ్జెక్టు పుస్తకాలను ఎంచుకొని నోట్స్ రాసుకుని మరి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

పేరు గొప్ప .. ఊరు దిబ్బ..

- చినుకు పడితే చిత్తడే
- రహదారుపైకి చేరుతున్న నీరు
- రాకపోలకు ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పేరుకే నియోజకవర్గ కేంద్రంగా ఉంది. ఏ వీధిలో చూసినా మురుగునీటి గుంతలు, చెత్తా చెదారంతో దుర్గధం వెదజల్లుతోంది. ఆర్‌టిసిలో చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. వర్షం కురిసిన తర్వాత వారం రోజులు పాటు బస్టాండ్ ప్రాంగణంలోని గుంతల్లో నీరు నిలిచి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. పిల్లలు, వృద్ధులు జారి పడిపోతున్నారు. బస్సు ఎక్కేందుకు ప్రయాణికులు బురదలో ఓ కాలు పెట్టి, బస్సులో ఓకాలు పెట్టాల్సి వస్తోంది. దీంతో బస్సుంతా మలినం అవుతోంది. బస్టాండ్ ఏర్పాటు సమయంలో రూ. కోటి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని మంత్రి సురేష్ హామీ ఇచ్చారు. రెండేళ్లు గడుస్తున్నా బస్టాండ్ ప్రాంగణంలోని గుంతల్లో కనీసం మట్టికూడా పోయలేదు. నాయకులు,ఆర్‌టిసి అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా చింతపల్లివారివీధి, పున్నయ్య వారి వీధి, వస్తాద్ వారి వీధి, బీసీ కాలనీ, ఎస్‌టి కాలనీ, సుందరయ్య నగర్‌లో వర్షపు నీరు నిలవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగునీటి గుంతలు దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. రాత్రులందు దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులు స్పందించి అంతర్గత రోడ్లకు కనీసం మరమ్మతులు చేయించి, ఆర్‌టి బస్టాండ్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్ ప్రాంగణలలో నిలిచిన మురుగునీరు



రహదారిపై నిలిచిన నీరు

హిందూ మతోన్మాదుల దాడికి వ్యతిరేకంగా పోరాడదాం

ఉదయనిధిపై ఆర్ఎస్ఎస్, బిజెపి వ్యతిరేక వ్యాఖ్యలకు ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి-కొండపి

తమిళనాడు ముఖ్యమంత్రి తనయుడు ఉదయనిధిస్టాలిన్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి ఉదయనిధిపై దాడి చేస్తున్న ఆర్ఎస్ఎస్ హిందూ, బిజెపి హిందూ మతోన్మాదుల దాడిని ప్రతిఘటించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కొండపి మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన జరిగింది. బస్టాండ్ సెంటర్లో ప్రజలనుద్దేశించి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిఎస్ సాగర్ మాట్లాడుతూ శనివారం చెన్నైలోని ప్రగతిశీల రచయితలు, కళాకారులు సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన వారిని ఉద్దేశించి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రశ్నించడానికి వీలు లేదని, కుల



ప్రజా సంఘాల ఆద్వర్యంలో నిరసన ప్రదర్శన కార్యక్రమం

అసమానత్వాలను పెంచి పోషిస్తుంది, వితంతువుల పునర్వివాహాలను వ్యతిరేకించాలని, మానవత్వాన్ని, సమానత్వాన్ని కోరుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలను వక్రీకరించి బీజేపి ఐటి సెల్ అధినేత అమిత్ మాలవ్య, హోంమంత్రి అమిత్‌షా తదితరులు 80 శాతం మంది సనాతన ఆచారాన్ని పాటించే వారిని హననం చేయాలని, చంపేయాలని ఉదయనిధి మాట్లాడాడినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ దుష్ప్రచారాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అలాగే నీటి విద్యా విధానం నీట్ ప్రవేశ పరీక్ష బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్యకు దూరం చేసే విధంగా ఉందని, అందుకే తాము వ్యతిరేకించామని అన్నారు. అందువలన ఉదయ్‌నిధి స్టాలిన్‌కు ప్రగతిశీల శక్తులు, దళితులు, ఇతర అణచివేతకు గురవుతున్న అన్ని వర్గాలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమెక్రసి జిల్లా నాయకులు కె.నాంచార్లు, ఆర్‌మోహన్, బి.పద్మ, వై.వి కృష్ణారావు, ఎం.నాగరాజు, ఎస్.భారతి, ఎల్.రాజశేఖర్, వి.మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి -మేదరమెట్ల

అత్యంత ఆధునిక హంగులతో ధతి డెవెలపర్స్ వారు మేదరమెట్లలో నిర్మిస్తున్న అక్షర కాపిటల్ సిటీలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలుకి రాజకీయ ప్రముఖల మధ్య అత్యంత వైభవంగా ఆదివారం ఉదయం శంకుస్థాపన జరిగింది. ఈ శంకుస్థాపనలో ధతి డెవెలపర్స్ ఛైర్మన్ గబ్బిట మణికుమార్, పి ఎల్ రమేష్, మంకలా రమేష్, జి సుధాకర్, ఇప్ప శ్రీనివాస్, ఆర్ శ్రీనివాస్, కె అంకారావు, పైనం ఏడుకొండలరెడ్డి, ఇతర ధతి డెవెలపర్స్ డైరెక్టర్లు, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వహణ అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మణికుమార్ మాట్లాడుతూ, ధృతి డెవెలపర్స్ తరుపున 80 ఎకరాల సువిశాల వెంచర్‌లో అక్షర కాపిటల్ సిటీని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఉడా తరపున అన్ని అనుమతులు పొందిన ఈ లేఅవుట్‌లో ఎనిమిదిన్నర ఎకరాల విస్తీర్ణంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్మాణం జరుగుతుందన్నారు.. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించటంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సంస్థలకి దేశవ్యాప్తంగా గొప్ప పేరు ఉందని అలాంటి ప్రఖ్యాత సంస్థ ఏర్పాటుకావటం మేదరమెట్లకి మణిహారంగా వెలుగొందుతుందని, గ్రామ అభివద్ధికి కూడా తోడ్పడుతుందని అన్నారు. డైరెక్టర్ పి. ఎల్. రమేష్


కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ మణికుమార్



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

మాట్లాడుతూ, “సువిశాలమైన ఎనిమిదిన్నర ఎకరాల ప్రాంగణంలో, ఫైవ్ స్టార్ వసతులతో ఈ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్మాణం పూర్తిచేసి, వచ్చే అకడమిక్ సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించాలని సంస్థ మేనేజ్మెంట్ భావిస్తోందన్నారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మేదరమెట్ల బ్రాంచ్ ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోని బ్రాంచ్‌ల కన్నా మంచి పేరు తెచ్చుకుంటుందని అన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆంధ్రప్రదేశ్ జీఎం రామరాజు మాట్లాడుతూ, “ఇప్పుడు మేదరమెట్లలో కట్టబోతున్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మన రాష్ట్రంలో 19వది, దేశంలో 327వది అని తెలిపారు. రాష్ట్ర నాయకులు వైవి సుబ్బారెడ్డి, బాచిన కష్ణ చైతన్య, ఇతర స్థానిక నాయకులు, అధికారులు తమకు అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలుపుతున్నాం.” అన్నారు. లక్షన్నర చదరపు అడుగుల వైశాల్యంతో, ఐదు అంతస్థుల భవనాలతో ప్రారంభమయే ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్.. ధతి డెవెలపర్స్ వారి అక్షర కాపిటల్ సిటీకే కాక మేదరమెట్ల ప్రాంతమంతటికీ అభివద్ధి ప్రదాతవుతుందని ఇతర అతిధులు, స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

11 నుంచి వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి బాపట్ల


వ్యాధి బారిన పడిన మేక

మేకలు గొర్రెలకు వైరస్ వల్ల కలిగే చీడ పారుడు రోగంతో మేకలు గొర్రెల పెంపకం దారులకు ఆర్ధికంగా తీవ్ర నష్టాన్ని కలగజేస్తుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎం. హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు . నాచురోగం అనే ఈ వ్యాధి తీవ్రత మేకల్లో అధికంగా ఉంది వ్యాధి సోకిన మేకలు తీవ్రమైన జ్వరం బారిన పడతాయి. మేత, నీరు తీసుకోలేవు. జీవాలు నీరసంగా ఉంటాయి. నోటిలో పుండ్లు ఏర్పడి పెదాల వాపు, కళ్ళ వెంట నీరు కారుతాయి. చూడి జీవాలు ఈసుకు పోయే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన మేకలకు పుట్టిన పిల్లలు అధిక శాతం మరణానికి గురవుతాయి. సాధారణంగా డిసెంబరు నుండి ఏప్రిల్ నెలల మధ్య ఈ వ్యాధి తీవ్రత ఉంటుంది.

వ్యాధి నివారణకు : ఈ వ్యాధిని నిరోధించేందుకు ఈనెల 11 నుండి జిల్లా వ్యాప్తంగా మేకలు గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 4లక్షల78వేల600 డోసుల టీకాలను ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని పశువైద్యశాల్లో సిద్ధంగా ఉంచాం. జిల్లాలో 75 టీములను ఏర్పాటు చేసి ఆయా టీముల ద్వారా టీకాలను జిల్లాలోని గొర్రెలు , మేకలకు ఉచితంగా వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు .

కోనేరులో గుర్తుతెలియని బాలుడి మృతదేహం

ప్రజాశక్తి - పంగులూరు.

మండలంలోని రామకూరు గ్రామంలో గల కొండపై ఉన్న రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో గుర్తుతెలియని బాలుని మతదేహం ఉన్నట్లు రేణింగవరం ఎస్సై కెకె తిరుపతిరావు ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కొండపై ఉన్న దేవాలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో సుమారు 10 నుంచి 12 సంవత్సరాల వయసు గల బాలుడు మృతదేహం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. బాలుని వివరాలు ఇంతవరకు తెలియలేదని, ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. ఒక వ్యక్తి సుమారు 10 నుంచి 12 సంవత్సరాల వయసు గల బాలుడిని, 14 సంవత్సరాల వయసు గల పాపను తీసుకుని నిద్ర చేయటానికి శనివారం దేవాలయం వద్దకు వచ్చాడు. గుడి ముందు భాగంలో కూర్చుని కూల్ డ్రింక్ తాగి, గుడి వెనుక భాగానికి వెళ్ళినట్లు అక్కడ ఉన్న సీసీ కెమెరా ద్వారా గుర్తించినట్లు గ్రామస్తుల ద్వారా తెలుస్తుంది. గుడి వెనుకకు వెళ్ళిన 45 నిమిషాల తర్వాత ఆ వ్యక్తి, పాప మాత్రమే తిరిగి వచ్చారని, ఆ వ్యక్తి బాలుడి చొక్కా, చెప్పులు తీసుకొని నవగ్రహాల వెనుక భాగంలో వదిలి వెళ్లిపోయారని, ఆ


బాలుడి మృతదేహం

సమయంలో పాప కళ్ళ వెంట నీరు కారటం ప్రత్యక్ష సాక్షి ఒకరు చూశారని గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. ఆదివారం ఒక వ్యక్తి గుడికి వెళ్లడంతో గుడి వెనుక భాగంలో ఉన్న కోనేరులో బాలుడి మతదేహం నీళ్లపై తేలుతూ కనిపించింది. కోనేరులో స్నానం చేసేటప్పుడు ప్రమాదవశాత్తు జారిపడి బాలుడు మరణించాడా? లేక ఏమైనా జరిగిందా ? బాలుడిని, బాలికను గుడికి తీసుకువచ్చిన వ్యక్తి బాలుడు తండ్రా, తండ్రి అయితే కొడుకు ప్రమాదవశాత్తు మరణిస్తే ఏమీ తెలియనట్లు వెళ్లిపోవటం ఏమిటి. అనే అనుమానాలు గ్రామ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసు దర్యాప్తులోనే అసలు విషయాలు తేలవలసి ఉందని గ్రామస్తులు చెప్పుకుంటున్నారు.


పురుగు మందు తాగి మృతి చెందిన నీవన్

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

యువకుడు పురుగు మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని కోలలపూడి గ్రామంలో చోటుచేసుకుంది. మార్టూరు ఎస్ఐ కోడూరి కమలాకర్ కథనం ప్రకారం కోలలపూడి గ్రామానికి చెందిన నక్కా అంజయ్య కుమారుడు నవీన్ (27) ఐటిఐ కోర్స్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పొలం వద్ద పురుగు మందు త్రాగి అపస్మారక స్థితిలో ఉన్న నవీన్‌ని గుర్తించిన స్థానికులు హుటాహుటిన 108కి సమాచారమిచ్చి ప్రైవేట్ వాహనంలో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో 108 వాహన సిబ్బంది ఎదురెళ్లి నవీన్‌ని మార్టూరు తరలించారు. పరిశీలించిన హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ముక్కామల వెంకటప్పరెడ్డి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. మతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. నవీన్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.


జెసి వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న పోటీలు

ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు

జెసి వారోత్సవాలలో భాగంగా ఒంగోలు పివిఆర్ గ్రౌండ్స్‌లో ఆదివారం ఆటల పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు ఆటలపోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా జెసి పాస్ట్ ప్రెసిడెంట్ సోమినేని సురేష్ వ్యవహరించారు. విద్యార్థులకు రన్నింగ్ రేస్, స్లో సైక్లింగ్, షార్ట్ పుట్, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ తదితర క్రీడలు నిర్వహించినట్లు జెసిఐ అధ్యక్షులు పి.ఆంజనేయులు తెలిపారు పోటీలలో పాల్గొని విజేతలుగా విద్యార్థులకు ఈ నెల 15వ తేదీన జరిగే గ్రాండ్ డే కార్యక్రమంలో బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని జెసి వీక్ చైర్మన్ జాహ్నవి జనార్ధన్ తెలియజేశారు. ఈ ఆటల పోటీల కార్యక్రమాన్ని ఆత్మకూరు బ్రహ్మయ్య, వివి రమణ, వి శ్రీరాముల రెడ్డి, జాలి రెడ్డి, కసిబిసి నాగేశ్వరరావు, నాయుడు మాల్యాద్రి పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979-80 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వపు విద్యార్థులు పాఠశాలకు ఆదివారం నాలుగు సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.12వేలు విలువ గల నాలుగు సీలింగ్ ఫ్యాన్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌కు పూర్వపు విద్యార్థులు అందజేశారన్నారు. త్వరలో పాఠశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాలకు అవసరమైన మౌళిక వసతులను సమకూర్చాలని పూర్వపు విద్యార్థులను కోరారు. ఈ సందర్భంగా 10 కూలింగ్ వాటర్ క్యాన్లను అందజేసినట్లు తెలిపారు.


ఫ్యాన్లను పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

పాలకవర్గాలు లేక కార్మికుల అవస్థలు



మూతపడ్డ సొసైటీ భవనం



చేనేత నాయకుడు మురుగుడు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రాష్ట్రంలో సేనేత సహకార సంఘాలకు గత ఐదేళ్లుగా ఎలాంటి పాలకవర్గం ఎన్నికలు జరగలేదు. నామినేషన్ బోర్డుతో సరిపెడుతున్నారు. ప్రభుత్వం జులై 7 నుండి ఉన్న బోర్డు కూడా పనిచేయకుండా చేశారు. దీంతో సహకార సంఘాల్లో లావాదేవీల సమస్య తీవ్రమైందని చేనేత నాయకులు మురుగుడు సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013ఫిబ్రవరి నెలలో సాగర్ సంఘాలకు ఎన్నికలు జరిపారు. పాలకవర్గ బోర్డు ఏర్పడింది. ఆ పాలకవర్గం 2019ఫిబ్రవరితో ముగిసింది. అప్పటి టిడిపి ప్రభుత్వం ఏడాది కాలం పాటు ఐదుగురు సభ్యులతో కూడిన బోర్డును ఏర్పాటు చేసింది. లావాదేవీలు కొనసాగించిందని తెలిపారు. తదనంతరం ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం కూడా అదే బాటలో నామినేషన్ బోర్డును ఏర్పాటు చేసింది. ఆ పాలకవర్గం కూడా ఈ ఏడాది జులై 6తో ముగిసింది. 7తేదీ నుండి సంఘాలకు ఎలాంటి బోర్డు లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. వైసీపీ పాలన నాలుగేళ్లలో 8విడతలుగా పాలకవర్గం మార్పులు చేర్పులు చేసిందని అన్నారు. ఇలాంటి తరుణంలో ప్రస్తుతం ఎలాంటి పాలకవర్గంగాని ,స్పెషలాఫీసర్‌నుగానీ లేకపోవడంతో సొసైటీలు లావాదేవీలు నిలిచిపోయి కార్మికులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చేనేత రంగం సంక్షోభంలో కూరుకపోయి కార్మికులకు పూర్తిస్థాయిలో పని లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం సంఘాలలో లావాదేవీలు లేకపోవడంతో కార్మికులకు అందాల్సిన అరకొర వేతనం కూడా అందటం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సహకార సంఘాలకు పాలకవర్గం కాని, లేక ప్రత్యేక అధికారులను గాని నియమించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

మానవత్వం చాటిన సీఐ సోమశేఖర్

- సీఐను అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు సపర్యాలు
- క్షతగాత్రులను పోలీస్ వాహనంలో వైద్యశాలకు తరలింపు



ప్రమాద క్షతగాత్రులకు సపర్యలు చేస్తున్న సిఐ సోమశేఖర్

ప్రజశక్తి - చీరాల

రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల పట్ల ఒకటో పట్టణ ఇన్చార్జి సీఐ సోమశేఖర్ మానవత్వాన్ని చాటుకుటన్నారు. వారికీ సపర్యాలు చేశారు. వారిని పోలీసు వాహనంలోనే చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం సాయంత్రం చీరాలలోని పేరాల - వాడరేవు రోడ్డులో ఆటో - ద్విచక్రవాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రేపల్లె మండలం పెటేరు గ్రామానికి చెందిన జె శ్రీనివాసరావు, శివపార్వతి దంపతులకు తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సమయంలో అటుగా విధుల్లో భాగంగా వెలుతున్న చీరాల రెండో పట్టణ సీఐ జి సోమశేఖర్ వెంటనే స్పందించారు. క్షతగాత్రులను తన పోలీస్ వాహనంలో ఎక్కించుకుని హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సీఐతోపాటు సహకరించిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. ప్రస్తుత జీవన విధానంలో ప్రజలు ఏదైనా రోడ్డు ప్రమాదం చూసినా పట్టించుకోనట్లు వెళ్లిపోతున్నారని అన్నారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం గుడ్ సమారిటన్ చట్టం తీసుకొచ్చిందన్నారు. ఈ చట్ట ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని మొదటి గంటలో దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడిన వ్యక్తిని గుడ్ సమారిటన్ గా గుర్తించి తగిన పారిదోషకం అందించబడుతుందని అన్నారు. మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ప్రమాదాలు జరిగిన వారిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు.

మురుగుపారుదలకు శాశ్వత పరిష్కారం ఏదీ?

- మురుగుతో విషజ్వరాలు, అంటు రోగాలతో అవస్థలు
- రహదారి సౌకర్యంలేక రామంటున్న ఆటోలు, రిక్షాలు
- జబ్బొస్తే మోసుకెళ్లడం తప్ప మరో మార్గంలేదు



ఇళ్లమధ్యలో ఏళ్ల తరబడి వదలని మురుగునీళ్లు

ప్రజాశక్తి, - భట్టిప్రోలు

ఎన్నో ఏళ్లుగా పట్టణంలోని 8వ వార్డులో నిల్వ ఉన్న మురుగునీటి పారుదలకు అధికారులు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఒకప్పుడు మాగాణి భూములుగా ఉన్న ఈ స్థలాలు క్రమక్రమంగా నివేశినా స్థలాలుగా మారాయి. అసలే లోతట్టు ప్రాంతంగా ఉంటుంది. గ్రామానికి చుట్టుపక్కల సాగునీటి కాలువ ప్రవహిస్తూ ఉండటంతో అధిక వర్షాలు, సాగునీటి ఉధృతితో లోతట్టు ప్రాంతం జలమయం అవుతుంది. ఈ ప్రాంత ప్రజలు వర్షాకాలం వస్తే మురుగునీరు ఇళ్లను చుట్టుముడుతుంది. దీంతో ఇళ్లు కాళీ చేసి బయటకు వెళుతున్న సంఘటనలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో మురుగు నీటిపారుదల మళ్లింపుకు రూ.కోట్లు ఖర్చుపెట్టారు. అయినా నిరుపయోగం అయ్యింది. ప్రణాళిక లేకుండా చేసిన డ్రైన్ పనులు వృధా అయ్యాయి. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వెనక లోతట్టు ప్రాంతంతో పాటు గిరిజన కాలనీ సమీపంలో కొందరు వ్యాపారస్తులకు చెందిన సొంత స్థలాలు కూడా పల్లప్రాంతంగా మారి ఏళ్ల తరబడి ఎండ, వానలతో సంబంధం లేకుండా మురుగునీరు నిల్వ ఉంటుంది. దీంతో సీజన్‌తో పని లేకుండా అనునిత్యం దోమలు వృద్ధి చెందుతూనే ఉంటాయి. ఎక్కడా లేని విధంగా బోదకాల వ్యాధి పూర్తిగా వ్యాపించి ఉంది. మురుగునీటితో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో సందర్శించిన డిపిఒ, ఆర్డిఓల సూచనలతో పంచాయతీ అధికారులు నీటిని బయటికి పంపేందుకు ఇంజన్లు ఏర్పాటు చేసినా ఫలితం లేదు. ఒక ప్రాంతంలో తోడే నీరు మరో ప్రాంతంలోకి వచ్చి చేరుతుంది.

యజమానులపై చర్యలేవి?

మురుగునీరు నిల్వ ప్రాంతం సొంత స్థలాలు కావడంతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకులేకపోతున్నారు. పంచాయితీల్లో ఖాళీ స్థలాలకు పన్నులు వేసే విధానం లేకపోవడంతో స్థలం యజమానులు పట్టించుకోవడంలేదు. ఖాళీ స్థలాల్లో నీళ్లు నిలిచి ప్రజలకు ఇబ్బందిగా మారింది. మురుగునీటి పారుదలకు శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంది.

భుజాలపై తీసుకెళ్లాల్సిన దుస్థితి

మురుగు నీటి ఆవాస ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలకు ఏదైనా అనారోగ్యం చేస్తే హాస్పిటల్‌కు వెళ్లేందుకు కూడా రహదారి మార్గం లేదు. ఎవరికైనా ఆనారోగ్యానికి గురైతే భుజాలపై మోసుకొని వెల్లటూరు ఛానల్ వైపు వంతెనకు లేదా బస్టాండ్ వైపు వంతెన వరకు వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. కాలువ కట్ట రహదారి మార్గమే ఏకైక మార్గమని కాలనీ వాసులు చెబుతున్నారు. వర్షం వస్తే బురదమయం కావడంతో ఆర్ఎంపి వైద్యులు కూడా వచ్చే పరిస్థితి లేదు. వైద్యశాలకు వెళ్లడానికి ఆటోలు, రిక్షాలు వచ్చే పరిస్థితి లేదు. మోసుకెళ్లడం తప్ప మరో మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు ఎవరికైనా చెబితే అంతే నంటు అధికార పార్టీ నేతలు బెదిరిస్తున్నారు. సమస్యలు తమకే చెప్పాలని అంటున్నారు. పంచాయితీ అధికారులైతే కనీసం బ్లీచింగ్ కూడా చల్లడంలేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మురుగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



షుగరు వ్యాధి గ్రస్తులకు కంటి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

కంటి పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్ : షుగర్ వ్యాధిగ్రస్తులు కంటి పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని కంటి వైద్యులు డాక్టర్ ఎం సతీష్‌కుమార్ సూచించారు. మండలంలోని గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో మంచాల వెంకటరామయ్య, రంగమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్రమం తప్పకుండా షుగర్ పరీక్షలు చేయించుకోవటం వల్ల చూపును కాపాడు కోవచ్చున్నారు. 100 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ మంచాల రమేష్ కుమార్, డాక్టర్ ఎ సాంబయ్య బిపి, షుగర్, గుండె పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ వలేటి కాంతారావు, పద్మావతి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు. కార్యక్రమంలో క్యాంపు కన్వీనర్ కె బాలచంద్రం, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, సిపిఎం రాష్ట్ర నాయకులు వై సిద్దయ్య, కె రామకోటేశ్వరరావు, కె సృజన, జ్యోతి, కమలాకర్, వి మోహన్‌రావు, కె జగన్నాథం, బి వేణుగోపాలరావు పాల్గొన్నారు.



యద్దనపూడి పోలీసు స్టేషన్లో అద్దంకి టిడిపి నేతలు

టిడిపి కార్యకర్తల నిరసన

ప్రజాశక్తి - అద్దంకి : చంద్రబాబు అరెస్టు, రిమాండుకు నిరసనగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించారు. పట్టణంలోని నామ్ రోడ్డు, నల్లవాగు, సింగరకొండ సమీపంలో రోడ్డుపై బైఠాయించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనాల టైర్లకు గాలి తీశారు. ట్రాఫిక్ కు అంతరాయం కల్గించినందుకు టిడిపి కార్యకర్తలను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చారు. న్యాయమూర్తి నిందుతులకు ఒక్కొక్కరికి రూ.50వేలు జరిమాన విధించి వ్యక్తిగత పూచి కత్తుపై విడుదల చేశారు.

యద్దనపూడి : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఇచ్చిన నిరసన పిలుపు మేరకు ముందు జాగ్రత్తగా ఆదివారం టిడిపి నాయకులు కె సతీష్, తారక రామారావు, నాగేశ్వరరావు ఎస్ఐ హానోకు అరెస్టు చేసినట్లు తెలిపారు.



షుటింగ్ బాల్ క్రీడాకారులకు అభినందనలు

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - చీరాల

నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో ఇవ షుటింగ్ బాల్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రం వ్యాప్తంగా 16జిల్లాల నుండి బాల బాలికలు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా బాలికల జట్టు 3వ స్తానాన్ని, బాలుర జట్టు 4వ స్తానాన్ని సాదించింది. విజేతలను బాపట్ల జిల్లా షుటింగ్ బాల్ అధ్యక్షులు డాక్టర్ బాబురావు, కార్యదర్శి పిల్లి సురేంద్ర అభినందించారు. విజయానికి కారణమైన బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు, కోచ్ వి హరిత ప్రశంసించారు.



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రాజేష్

షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

ఆధునిక జీవనంలో పని ఒత్తిళ్ళ నేపథ్యంలో షుగర్ వ్యాధి బారిన పడినవారు అప్రమత్తంగా ఉంటూ ఆహార అలవాట్లను మార్చుకొని జాగ్రత్త వహించాలని డాక్టర్ ఉదరగుడి రాజేష్ అన్నారు. పబ్బి శెట్టి సత్యనారాయణ, అన్నపూర్ణమ్మ ఆవోప ఆధ్వర్యంలో ప్రతినెల రెండవ ఆదివారంన నిర్వహించే ఉచిత డయాబెటిక్ క్యాంపు విజయవంతం అయ్యింది. క్యాంపులో సుమారు 80మందికి డాక్టర్ ఉదరగుడి రాజేష్, డాక్టర్ మేడిద దివ్య సుధాకర్ దంపతులు వైద్య పరీక్షలను అందించారు. డయాబెటిస్ పలు వైద్య సమస్యలపై అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని అన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని చెప్పారు. ఆకు కూరలు తీసుకోవాలని అన్నారు. ఆహార పద్దతులు మార్చుకోవడం ద్వారా మందులపై ఆధారపడకుండా షుగరు నియంత్రించుకోవచ్చని చెప్పారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

తాగునీరు కూడా అందించలేని స్థితిలో ప్రభుత్వం

పాదయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా క్యాదర్శి సయ్యద్ హనీఫ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి-దొనకొండ

ప్రజలకు తాగునీరు కూడా అందించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ విమర్శించారు. సిపిఎం పాదయాత్ర సందర్భంగా మండల పరిధిలోని కొచ్చెర్లకోట గ్రామంలో ఆదివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ కొచ్చెర్లకోట ప్రజలు తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారని తెలిపారు. ప్రజలకు తాగునీరు కూడా ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదా అని ఆయన ప్రశ్నించారు. ఒక్కప్పుడు శ్రీకష్ణ దేవరాయలు తొవించిన చెరువు నేడు పిచ్చి చెట్లుతో నిండిపోయి ఉందన్నారు. ఆ చెరువుకు గుండ్లకమ్మ నది నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు తెచ్చి ప్రజలకు తాగునీరు సరఫరా చేయవచ్చునని తెలిపారు. ప్రజలకు నీటి కోసం కోసం పోరాడతామని తెలిపారు. ప్రకాశంను వెనుక బడిన జిల్లాల జాబితాలో చేర్చాలన్నారు. ఉపాధి పనులు 200 రోజులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సమస్యలతో కూడిన వినతిపత్రం పాదయాత్ర బందానికి అందజేశారు. తొలుత పాదయాత్ర దొనకొండ నుంచి పరిశ్రమల కేంద్రం మీదుగా రుద్రసముద్రం నుంచి కొచ్చర్ల కోటకు చేరింది. మధ్యలో పరిశ్రమల కేంద్రం వద్ద ఎపిఐఐసి ప్రభుత్వ భూముల్లో వేసిన రోడ్డును పరిశీలించారు. పలు డిమాండ్లతో చేపట్టిన పాదయాత్రకు ఆయా గ్రామాల్లో జనం నుంచి మంచి ఆదరణ లభించింది. ఈ కార్యక్రమంలో సిపిఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు, మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కుందుర్తి అనిల్, పాదయాత్ర బృందం సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, వెల్లంపల్లి ఆంజనేయులు, కె.రమాదేవి, పి.కల్పన, బి.రఘురామ్, వి.బాలకోటయ్య, డికెఎం.రఫీ, కె.మాల్యాద్రి, సిహెచ్.వినోద్, సిపిఎం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు సహకారం అందిస్తా

టిటిడి బోర్డు సభ్యులు శిద్దా సుధీర్ కుమార్



శిద్దా సుధీర్ కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఆర్యవైశ్యులందరికి సహకారం అందిస్తానని, శ్రీవారికి సేవ చేసుకునే అవకాశం దొరకటం తన అదృష్టమని టిటిడి పాలక మండలి సభ్యులు శిద్దా సుధీర్ కుమార్ తెలిపారు. స్థానిక వైశ్య భవన్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో టిటిడి పాలక మండలి సభ్యులు శిద్దా సుధీర్ కుమార్ ఆత్మీయ అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు శిద్దా సుధీర్ కుమార్, శిద్దా రాఘవరావు దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ వాసవి మాతకు పూజలు నిర్వహించగా, వేద పండితుల ఆశీర్వదం అందజేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘాల నాయకులు టిటిడి బోర్డు సభ్యులు శిద్దా సుధీర్ కుమార్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులను, గజమాలతో, వెండి కిరీటంతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీమంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ తమ కుమారుడు సుధీర్ కుమార్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య సంఘాల వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్యులు తమ కుటుంబ సభ్యులని, వారికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. టిటిడి పాలకమండలి సభ్యులు శిద్దా సుధీర్ కుమార్ మాట్లాడుతూ తనను టిటిడి పాలకమండలి సభ్యులుగా నియమించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు శిద్దా లక్ష్మి పద్మావతి, ఆర్యవైశ్య కార్పొరేషన్ కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ .శిద్దా సుధీర్ కుమార్, మాజీ అధ్యక్షులు శిద్దా సూర్య ప్రకాశరావు, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిల్లంచెర్ల బాల మురళి కష్ణ, కార్యదర్శి జలదంకి కష్ణారావు, కోశాధికారి కొత్తూరు శ్రీరంగనాయకులు, వాసవీ సత్ర సముదాయాల గౌరవాధ్యక్షుడు శిద్దా నాగేశ్వరరావు, కొత్తూరి రంగనాయకులు, కొణిజేటి సురేష్, దేవతు రాజా, ఇమ్మిడిశెట్టి సత్యనారాయణ, ఆర్యవైశ్య మహిళా విభాగం నాయకురాలు లక్ష్మీ మోహన్, సురె ఉమాదేవి, రావిపూడి లక్ష్మీనారాయణ, చలువాది బదరీ నారాయణ, డాక్టర్ చావల ప్రకాష్, సురె చిన సుబ్బారావు, చందోలు మణికంత, బొగ్గవరవు సుబ్బారావు, అచ్యుత ప్రకాష్, కొల్ల భాస్కర్, మోదుకురి వెంకటేశ్వర్లు, చక్కా వెంకట కేశవరావు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వండి : ఈదర



సుమతిని సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వయస్సుతో సంబంధం లేకుండా క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని జడ్‌పి మాజీ చైర్మన్ ఈదర హరిబాబు తెలిపారు. స్థానిక హోటల్ మౌర్య ఇన్‌లో ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కోశాధికారి శివ శంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈదర హరిబాబు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా నిరంతరం క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్‌ను మరింత అభివధి పథంలో నడిపించాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సమావేశాలపై చర్చించామన్నారు. నవంబర్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఆరికట్ల సుమతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన వారిని అసోసియేషన్ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్, విశ్రాంత ఎస్‌పి కాకుమాను రాజా శిఖామణి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కర్‌రావు, మహిళా కార్యదర్శి వనజ, కార్పొరేటర్ అశ్విని, రాష్ట్ర కార్యదర్శి సైకం రాంప్రసాద్, రాష్ట్ర ట్రెజరర్ పాదర్తి శివశంకర్‌రావు, 13 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశవరావు

కాంట్రాక్ట్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలి

సిఐటియు జిల్లా నాయకుడు పిసి.కేశవరావు

ప్రజాశక్తి -కనిగిరి

స్కీం కాంట్రాక్ట్ వర్కర్స్‌ను పర్మనెంట్ చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పిసి.కేశవరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు మండల కమిటీ సమావేశం ఎస్‌కె .ఖాదర్ వలి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ స్కీంకాంట్రాక్ట్ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేందన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. రాబోవు కాలంలో సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో సుకన్య, రమాదేవి, ప్రసన్న ,లాల్‌బి ,మల్లేశ్వరి, ,పిచ్చయ్య ఎం.శ్రీను ,వెంకటరెడ్డి.ప్రసాద్ నరేంద్ర, ఏడుకొండలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

అంబేద్కర్ అందరి వ్యక్తి

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి- కొత్తపట్నం

డాక్టర్ అంబేద్కర్ అందరి వ్యక్తి అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సంకువారిగుంట నూతన కాలనీలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరిం చారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ అతి చిన్న గ్రామమైన సంకువారి గుంటలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. రూ. 22 లక్షల 9 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహం ఏర్పాటుకు స్థానికులు ఖమ్మం జిల్లాలోని మమత హాస్పిటల్‌లో న్యూరాలజీ విభాగండాక్టర్ కసుకుర్తి జగదీష్ బాబు ,మాజీ ఎమ్మెల్సీ, ఎపి సామాజిక సలహాదారులు జూపూడి ప్రభాకర్ రావు సహకారం అందించారన్నారు. సంకు వాని గుంట చిన్న గ్రావ ఎమైనప్పటికీ ఇక్కడ పుట్టి పెరిగిన అనేకమంది రాజకీయ నాయకులు, విద్యావేత్తలుగా దేశ విదేశాలలో రాణిస్తున్నారని తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతులమీదుగా పెద్దవాగు బ్రిడ్జికి శంకుస్థాపన చేయి స్తానని హామీ ఇచ్చారు. అంబేద్కర్ ఆశయాలతో ముందుకు నడుస్తూ గ్రామ అభివద్ధికి పాటుపడాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. సంకువాని గుంట సర్వసతి పుత్రులకు పుట్టినిల్లు అని తెలిపారు. ఈ గ్రామానికి అనేక మంది కలెక్టర్లు, జిల్లా అధికారులు, రాజకీయ ప్రముఖులుగా రాణిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులు, అంబేద్కర్ అభ్యుదయ యువజన సంఘం విశ్రాంత ఉద్యోగులు సహ కారంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మీ నాయక్, ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి, గ్రామ సర్పంచి సుబ్బరత్తమ్మ, ఉప సర్పంచి మురళి, వైసిపి మండల అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రారెడ్డి, ఎంపిడిఒ సుజాత, ఇఒఆర్‌డి బాల చెన్నయ్య, మత్స్యకార సంఘం డైరెక్టర్ వాయల సుమతి, మాజీ ఎంపిపి బలగాని శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి జట్టి కోటేశ్వరమ్మ, చీమకుర్తి జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వెంకట్రావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

పెద్ద నరసింహారావుకు నివాళి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి మాజీ ఎంపిపి కొవెలకుంట్ల నరసింహారావుకు సోదర వియోగం కలిగింది. ఆయన సోదరుడు పెద్ద నరసింహారావు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి కంభాలపాడు వచ్చి పెద్ద నరసింహారావు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొలమారి చెన్నారెడ్డి, మల్లాపురం చిన నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చెరువు పోయింది.. కట్ట మిగిలింది..

- 150 ఎకరాల తిమ్మరాజు చెరువులో మిగిలింది 10 ఎకరాలే
- జామాయిల్ ఇతర తోటల సాగు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

అక్రమార్కులు దర్జాగా చెరువులు కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. అందుకు నిదర్శనమే పుల్లలచెరువు మండలం కొమరోలు పంచాయతీ పరిధిలోని తిమ్మరాజు చెరువు. చెరువు దాదాపు మాయమై కట్టే మిగిలింది. తిమ్మరాజు చెరువు సూమారు 150 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉంది. ప్రస్తుతం ఈ చెరువు విస్తీర్ణం కేవలం 10 ఎకరాల లోపు మాత్రమే మిగిలి ఉంది. సుమారు 70 మందికి పైగా స్థానికులు, కష్టా జిల్లాకు చెందిన అక్రమార్కులు చెరువును కబ్జా చేశారు. జామాయిల్, ఇతర పంటలు సాగు చేశారు. చెరువును పూర్తిగా చదును చేసి నీరు చేరకుండా కట్టలు ఏర్పాటు చేశారు. వర్షాలు పడి చెరువుల్లో నీరు చేరినప్పుడు అక్రమార్కులు పంటలను రక్షించుకోనేందుకు తూములను తెరిచి నీటిని బయటకు పంపిన ఘటనలు అనేకం ఉన్నాయి. వర్షాలు పడి నీరు చేరినా, నెల రోజుల్లోనే నీరు అంత పోయి చెరువు ఎండిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొన్ని సంవత్సరాల్లో పుల్లలచెరువు మండలం లోని చెరువులు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ చెరువుకు 700 ఎకరాల ఆయకట్టు వుంది. చెరువులో నీరు నిల్వ ఉండకపోవడంతో ఆ చెరువు కింద ఉన్న భూములన్ని బీడు భూములుగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తిమ్మరాజు చెరువుతో పాటు, పుల్లలచెరువు మండలంలోని చెరువులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని వాటికి పూర్వవైభవం తీసుకురావాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ డిఇ జి.మురళీ మోహన్‌ను వివరణ కోరగా చెరువు ఆక్రమణ దారులకు రెవెన్యూ శాఖ సహకారంతో నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే ఆక్రమిత చెరువు భూమిని స్వాధీనం చేసుకుంటామని ఆయన చెప్పారు.



చెరువు భూమిలో సాగు చేసిన జామాయిల్

12 నుంచి ఆటల పోటీలు

ప్రజాశక్తి-కొండపి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆప్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి మండల స్థాయిలో అన్ని పాఠశాలు, కళాశాలల విద్యార్థిని వివిధ రకాల పోటీలుయ నిర్వహిస్తున్నట్లు క్రీడా సమన్వయకర్త ఫిజికల్ డైరెక్టర్ ఎ.రవికిరణ్, కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు తెలిపారు. కీడ్రాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తీసి రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకెళ్లేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12,13 తేదీల్లో మండల స్థాయిలో పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించిన వారికి 14,15,16 తేదీలలో నియోజకవర్గ స్థాయిలో పోటీలకు నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నైపుణ్యం ప్రదర్శించిన 18,19,20 తేదీలలో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 12న అండర్-14, అండర్-17 బాలికలకు గేమ్స్, 13న అండర్-14,17 విభాగంలో మండలస్థాయి పోటీల్లో నిర్వహిస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థి వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

కంభం రూరల్ : కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 12,13 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేష ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడల పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మాల్యాద్రి,స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎస్. సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పోటీలలో పాల్లోనే విద్యార్థులు తమ పాఠశాల అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో తమ పేర్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. పోటీలు అండర్-14,17 విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జయకుమార్

'జైభీమ్' ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని గుడిపల్లి చందుకల్యాణ మండపంలో జైభీమ్ భారత్ పార్టీ కొండపి నియోజకవర్గ స్థాయి మండల కన్వీనర్లు, నాయకులు కార్యకర్తలు అభిమానులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ , బాబూజగ్జివన్‌రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జై భీమా పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జయకుమార్, కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు కోరిశపాటి వెంకట్రావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా నియోజక కన్వీనర్లు కె.డేవిడ్,జె.శివ, పి.హేబెలు, డి.బాబూరావు, డి.వెంకటేశ్వర్లు , దళిత నాయకులు బడుగు నాగభూషణం, సమతా సైనిక్ దల్ జిల్లా అధ్యక్షుడు మిడసల బడ్డకోటి, దావులూరి రాఘవులు పాల్గొన్నారు.

విద్యాసాగర్‌బాబుకు డాక్టరేట్

ప్రజాశక్తి-ముండ్లమూరు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు ప్రాచుర్య భాషా విభాగంలో పిహెచ్‌డి చేసిన దారా విద్యాసాగర్ బాబుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కోఆర్డినేటర్ పి.కిరణ్మయి తెలిపారు. సాగర్‌బాబు పాతంజలి యోగ దర్శనం, వైజ్ఞానిక ప్రయోజనం అనే అంశంపై ఆచార్య కె.సత్యనారాయణ పర్యవేక్షణలో విద్యాసాగర్‌బాబు పరిశోధన గ్రంథం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, పరిశోధకులు సాగర్‌బాబుకు అభినందనలు తెలిపారు.

800 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని పిబిఎన్ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో మునగా కోటిరత్నం పౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహి ంచారు. ఈ వైద్యశిబిరాన్ని డాక్టర్ మునగా నరసింహరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురగా నరసింహరావు, డాక్టర్ సుమన్ , డాక్టర్ గీతాపద్మ, డాక్టర్ ఆశీస్‌నీలి, డాక్టర్ మునగా డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ నీరజ్‌కుమార్, డాక్టర్ మునగా అనిల్ ఆధ్వర్యంలో 800 మంది వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మునగా ఆంజనేయులు, మారుతి, మునగా నాగేశ్వర రావు, సంఘ సేవకుడు రత్నం, డాక్టర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి- దర్శి

అద్దంకి రోడ్డులోని సందువారి పాలెంకు చెందిన పి.ఆదిలక్ష్మి వర్ధంతి సందర్భంగా షిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులు పద్మావతి, వీరబ్రహ్మాచారి, వద్ధాశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మార్కాపురం విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-మార్కాపురం

కేరళ రాజధాని తిరువనంతపురం జిమ్మీ జార్జ్ స్పోర్ట్స్ హబ్‌లో నిర్వహించిన సెకండ్ సౌత్ ఇండియన్ కరాటే ఛాంపి యన్‌షిప్ పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున మార్కాపురం పట్టణానికి చెందిన ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఎస్.జస్వంత్‌రెడ్డి అండర్-13 బాలుర 65 కిలోల కుమ్మితే విభాగంలో గోల్డ్ మెడల్, ఎస్‌కె హుస్సేన్ బాషా అండర్-13 బాలుర 45 కేజీల కుమ్మితే విభాగంలో రజిత పతకం, ఎస్‌కె.జోయాసిద్ధికి అండర్-10 బాలికల కటా విభాగంలో రజిత పతకం సాధిచింది. ఈ కార్యక్రమంలో కరాటే ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ సంజయ్ కుమార్ పాల్గొన్నారు. పతకలు సాధించిన విద్యార్థులను ఎమ్మెస్ స్పోర్ట్స్ కరేటే స్కూల్ చీఫ్ ఎగ్జాం మారంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.



పతకం సాధించిన విద్యార్థి

రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పొదిలి

రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పొతవరం ఎస్‌సి కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాలు, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. తొలుత ఎమ్మెల్యే వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొవెలకంట్ల నరసింహారావు, గొలమారి చెన్నారెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు ఎస్‌కె.నూర్జాహాన్ బేగం, మాజీ సర్పంచి, నగర పంచాయతీ బీసీసెల్ అధ్యక్షుడు పులగొర్ల శ్రీనివాసులు, ఎస్‌సిసెల్ అధ్యక్షుడు మల్లాపురం చిన నరసింహులు, గూడూరి వినోద్, నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకట రెడ్డి, కెకెమిట్ల ఎంపిపి మోరబోయిన మురళికృష్ణ, నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తల్లపురెడ్డి వెంకట నారాయణ రెడ్డి, వెంకట రావు, వైసిపి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకూలో ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ జ్ఞాపలను నెమరువేసుకుంటూ, ఆనాటి విద్యార్థులు, మరియు ఉపాధ్యాయులు ఒక చోట కలసి సభను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇప్పుడు టీచర్లుగా, తహ శీల్దార్లుగా, సాఫ్ట్‌వేరే ఇంజినీర్లుగా ఎదిగినప్పటికీ తాము చదివిన పాఠశాలను, ఉపాధ్యాయులను, తోటి స్నేహితులను మరిచిపోకుండా అందరూ ఒక చోట కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడం ఎంతో మంచి విషయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డిఇఒ వెంకటరెడ్డి, టి.శ్రీనివాసులు, మార్కాపురం ఎంఇఒ, ప్రధానోపాధ్యాయులు సుధాకర్ కష్టారెడ్డి, మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చంద్రబాబుపై ఆధారాలతోనే కేసు నమోదు : ఎంపీ మోపిదేవి

ప్రజాశక్తి -రేపల్లె

టీడీపీ అధినేత చంద్రబాబు అవినీతి, అక్రమాలపై పూర్తి ఆధారాలతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు స్పష్టం చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఫైనాన్స్ డిపార్ట్మెంట్ అభ్యంతరాలను పక్కకు నెట్టి క్యాబినెట్ నిర్ణయాలతో సంభంధం లేకుండా సీమెన్స్ సంస్థను తెరపైకి తీసుకువచ్చి భారీ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. రూ.370కోట్ల నిధులు బినామీ పేర్లతో తనయుడు లోకేష్ ఖాతాలోకి మరల్చారనే స్పష్టమైన ఆధారాలతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారని చెప్పారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, జనసేన అధ్యక్షులు పవన్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మోపిదేవి

కళ్యాణ్ చంద్రబాబుకు సానుభూతిని తెలపటం దొంగతనం చేసిన వ్యక్తిని సమర్ధించటమే అన్నారు. పవన్ కళ్యాణ్, పురందేశ్వరి, బాలకృష్ణ, భువనేశ్వరి ప్రత్యేక విమానాలలో గన్నవరంలో దిగేంత డబ్బు ఎక్కడ నుండి సమకూరాయని ప్రశ్నించారు. చేసిన అవినీతి నుండి బయట పడేందుకు ఢిల్లీ నుండి అతి ఖరీదైన అడ్వకేట్లను పిలిపించటం ఎందుకని ప్రశ్నించారు. విచారణ సంస్థలను నిజాయితీగా ఎదుర్కొనే దమ్ము ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. ఆనాడు జగన్ ఏం అవినీతి చేశారని అరెస్టు చేశారో చెప్పాలన్నారు. ఆనాడు జగన్‌కు వస్తున్న ప్రజాభిమానాన్ని చూడలేక ఆధారాలు లేకపోయినా అరెస్టు చేశారని అన్నారు. చంద్రబాబు, సోనియా, చిదంబరం కాళ్లు పట్టుకొని సిబిఐ ప్రోత్సాహంతో ఆనాడు జగన్ ని అరెస్టు చేయించారని చెప్పారు. ప్రస్తుతం ఆధారాలతో చంద్రబాబు అడ్డంగా బుక్కయ్యారని తెలిపారు. విచారణ అధికారులు ఏమి అడిగినా చంద్రబాబు నాకు ఏమాత్రం గుర్తు లేదని చెప్పటం చట్టాన్ని తప్పుదారి పట్టించడమే అన్నారు. రాజధాని నిర్మాణంలో, టిడ్కో ఇళ్ళనిర్మాణంలో షాపుజీ, పల్లంజీ, ఎల్ అండ్ టి కంపెనీలలో రూ.118కోట్ల అవినీతి జరిగిందన్నారు. చంద్రబాబు అరెస్టుపై సానుభూతి తెలపటం ఆర్థిక నేరస్తులను ప్రోత్సహించటమేనని అన్నారు.




వైభవంగా ప్రసన్నాంజనేయ విగ్రహ ప్రతిష్ట

ప్రసన్నాంజనేయ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - అద్దంకి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ముఖః మండపం పునః నిర్మాణం చేయనున్నారు. ఈ నేపథ్యంలో దేవస్థానంలో నూతనంగా బాలాలయం నిర్మాణం చేశారు. బాలాలయంలో ఆలయ పూజారులు అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధలతో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్టించారు. ఈ ప్రతిష్ట మహెూత్సవంలో ఆలయ ఈఓ టి సుభద్ర, ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.



కనకయ్య విగ్రహావిష్కరణ చేస్తున్న నేతలు

కనకయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పర్చూరు

బిఎఆర్‌టిఎ జూనియర్ కళాశాల ఆవరణలో పర్చూరు ప్రాంతీయ విద్యాభివృద్ధి సంఘం వ్యవస్థాపకులు కామ్రేడ్ కృష్ణంశెట్టి కనకయ్య విగ్రహావిష్కరణ ఆదివారం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ ఉప్పుటూరి మురళీకృష్ణ, నటులు కారుమూరి శీతారామయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ పర్చూరు ప్రాంత విద్యాభివృద్ధికి కనకయ్య మాస్టారు కృషి వెలకట్టలేనిదని అన్నారు. పర్చూరు ప్రాంతాన్ని విద్యా కేంద్రంగా అభివృద్ధి చేశారన్నారు. బాలికోన్నత పాఠశాల ఏర్పాటుతో బాలికా విద్యాభివృద్ధికి కృషి చేశారని అన్నారు. శీతా రామయ్య మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కనకయ్య వెన్నంటి ఉన్నారని అన్నారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కృష్ణంశెట్టి రమేష్‌బాబు, షేక్ అహ్మద్‌బాషా, కోట హరిప్రసాద్, పాబోలు ఉదయభాస్కర్, ప్రిన్సిపాల్ చింపారెడ్డి, డిఎస్‌పి ఉప్పుటూరి రవిచంద్ర, కె రామకోటేశ్వరరావు, కృష్ణంశెట్టి పార్వతి, కొల్లా వెంకటేశ్వర్లు, కనకయ్య కుటుంబ సభ్యులు, జె శ్రీనివాసరావు, కె అజయ్ పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - రేపల్లె

టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి శ్రేణులు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి మండల అధ్యక్షులు రేపల్లె రామాంజనేయులు దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. టిడిపి సీనియర్ నాయకులు జీవి నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యం ఖూనీ జరుగుతోందని ఆరోపించారు. సంఘం డైరీ డైరెక్టర్ నర్రా వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అరాచక పాలన నడుస్తుందని అన్నారు. సీఐడీ అధికారులు నిబంధనలకు



దీక్షల్లో మాట్లాడుతున్న రామాంజనేయులు

విరుద్దంగా వ్యవహరించారని అన్నారు. పోలీసులు నియమ, నిబంధనలకు లోబడి వ్యవహరించాలని కోరారు. జగన్ పాలనపై విసుగెత్తిన ప్రజలు చీకొడుతున్నారని అన్నారు. దీక్షలో కె రాము, మేక శివరామకృష్ణ, పంతాని మురళిధరరావు, కె వెంకటేశ్వరరావు, అనగాని శివ ప్రసాద్, చింతారావు, యాలవర్తి లక్ష్మీ, గౌరీ రామకుమారి, సుబ్రహ్మణ్యం, ధర్మతేజ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : నియోజకవర్గ కేంద్రమైన వేమూరు పుర వేదిక వద్ద చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు సామూహిక నిరాహార దీక్ష చేశారు. టిడిపి నాయకులను గృహ నిర్బంధం చేపట్టినప్పటికీ దీక్షలో పాల్గొన్నారు. టిడిపి నాయకులు జొన్నల గడ్డ విజయబాబు, మైనేని మురళీకృష్ణ, వాకా శేషుబాబు, కనగాల మధుసూదన్ ప్రసాద్, ఎడ్ల జయశీలరావు, కనపర్తి సుందర్రావు, బట్టు మల్లికార్జునరావు, సిరాజుద్దీన్, వేములపల్లి జగన్నాధరావు పాల్గొన్నారు.

టిడిపి కార్యదర్శి సాయిబాబాపై వైసీపీ దాడి

ప్రజాశక్తి, - భట్టిప్రోలు

టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబాపై వైసిపి నాయకులు దాడికి తెగబడ్డారు. దీంతో టిడిపి వర్గీయులు సుమారు ఐదు గంటల పాటు ధర్నా, రాస్తా రోకోలు చేపట్టారు. చంద్రబాబు అరెస్టును నేపధ్యంలో పోలీసులు సాయిబాబును గృహనిర్బంధం చేశారు. ఆయనకు కాపలాగా ఏఎస్ఐ, ఇరువురు కానిస్టేబుల్‌లను నియమించారు. పోలీసుల సమక్షంలో గ్రామానికి చెందిన నలుగురు వైసిపి నాయకులు ఇంటిలోకి ప్రవేశించి తనపై దాడి చేశారని సాయిబాబు చిరిగిన బట్టలు, గాయాలతో రోడ్డెక్కారు. వైశ్య సామాజిక వర్గానికి చెందిన సాయిబాబు



చిరిగిన చొక్కాతో రోడ్డుపై సాయిబాబు

పై దాడి జరిగిన సమాచారం తెలుసుకున్న ఆ సామాజిక వర్గ దుకాణదారులు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. దీంతో రెండు గంటలపాటు రథం సెంటర్, మరో రెండు గంటల పాటు బస్టాండ్ సెంటర్లో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు రాస్తారోకో నిర్వహించారు. రేపల్లె డిఎస్పి చొరవతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నిందితులపై ఫిర్యాదు చేయించారు. ఇదిలా ఉండగా సాయి బాబా తమపై దాడి చేశారంటూ వైసీపీ నాయకులు అరుణశాస్త్రి, సలీం, కోటేశ్వర రావు, శ్రీనివా సరావు ముందుగానే పోలీస్ స్టేషన్‌కు రావడంతో పోలీసులు స్వయంగా పోలీస్ జీవుతో రేపల్లె వైద్యశాలకు తరలించటం చర్చగా మారింది. దాడి చేసిన వ్యక్తులను పోలీసులే జీబులో వైద్యశాలకు పంపించడం, పోలీసుల సమక్షంలోనే సాయిబాబాపై అదే నలుగురు దాడి చేయడం హేయమైన చర్యని విచారించి న్యాయం చేయాలంటూ సాయిబాబా డిమాండ్ చేశారు.

ఫిల్టర్‌బెడ్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని నాగులపాలెంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ అనుబంధ సంస్థ కమ్యూనిటీ క్రాప్స్ చే ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌కు రూ.7లక్షల అంచనాతో ఫిల్టర్ బెడ్, సంపు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ ఎన్నారై ముద్దన హరిబాబు, క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు చేశారు. ఫిల్టర్ బెడ్ ఎర్పాటుతో వాటర్ ప్లాంట్‌కు నిరంతరంగా నీరు లభ్యమవుతాయని తెలిపారు. రోటరీ సభ్యుల పూర్తి ఆర్థిక సహాయంతోపాటు



ఫిల్టర్ బెడ్‌కు భూమిపూజ చేస్తున్న దృశ్యం

దాతలు నుండి సేకరించిన విరాళంతో అధునాతనంగా ఈ ఫిల్టర్ బెడ్ నిర్మిస్తామని తెలిపారు. దీనితో తాగునీటి కష్టాలు తప్పుతాయని అన్నారు. ప్రజలకు అవసరమైన నీటి సరఫరా చేయొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిసి అధ్యక్షుడు చాగంటి నాగేశ్వరావు, సభ్యులు కొల్లా శ్రీనివాసరావు, కొల్లా శివరామకృష్ణ, కొల్లా నరేంద్ర కుమార్, ఆర్‌సిసి డైరెక్టర్ తేళ్ల రమేష్ చంద్ర, రోటరీ క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోమటి ఆంజనేయులు, పాబోలు వెంకన్న, పోలిశెట్టి చంద్రం, భవనం రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మెగా ఉచిత గుండె వైద్యశిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంగులూరు రోటరీ భవన్ దగ్గర ఈనెల 11న ఉచిత మెగా గుండె వైద్య శిబిరం జరుగుతుందని క్లబ్ క్యాంపు కన్వీనర్ చిలుకూరి వీర రాఘవయ్య తెలిపారు. విజయవాడ హెల్ప్ హాస్పిటల్స్ కి చెందిన గుండె వైద్య నిపుణులు, వారి వైద్య బృందం పాల్గొంటారని తెలిపారు. గుండె జబ్బులతో బాధపడే వారికి ఉచితంగా బిపి, షుగర్, గుండె స్కానింగ్ పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆయాసం, గుండె నొప్పి, గుండె దడ, గుండెల్లో మంట, గుండెల్లో బరువుగా ఉండటం, ఎక్కువ కాలంగా బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడే వారికి, గుండె పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. అవసరం ఉన్నవారికి రూ.12,500ల విలువ గల ఆంజియో గ్రామ్ పరీక్ష విజయవాడ హాస్పటల్లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.




కన్వీనర్ నియామక పత్రం ఇస్తున్న కేసన శంకరరావు

బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్‌గా వెంకటకృష్ణ

ప్రజాశక్తి - నిజాంపట్నం

బీసీ సంక్షేమ సంఘం రేపల్లె నియోజకవర్గ కన్వీనర్‌గా నగరం మండలానికి చెందిన న్యాయవాది మోర్ల వెంకటకృష్ణను నియమించినట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. మండలంలోని బొర్రావారిపాలెంలో మోర్ల వెంకటకృష్ణకు నియామక పత్రం ఆయన ఆదివారం అందజేశారు. వెంకటకృష్ణకు రాజకీయ, సామాజిక, వర్తమాన అంశాలలో పట్టు ఉందని అన్నారు. బీసీల సంక్షేమం పట్ల అవగాహన ఉన్న వ్యక్తి అని శంకరరావు పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని వెంకటకృష్ణ అన్నారు. తనపై నమ్మకంతో తనకు అప్పజెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. బీసీలందరిని సంఘటితపరచి హక్కుల సాధనకు పాటుపడతానని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నాగబాబు, బడుగు వెంకట నారాయణ, ఎం.శివయ్య, కేశన చైతన్య, యేమినేని వెంకటేశ్వరరావు, కేసన శంకర్ పాల్గొన్నారు.



హిందీ ప్రత్యేక కోర్సుల పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ముగిసిన హిందీ పరీక్షలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక టీఎం రావు ఉన్నత పాఠశాలలో శని, ఆదివారాలు నిర్వహించిన హిందీ మౌఖిక పరీక్షలు ముగిశాయి. దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలు పరిచయ, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు ఆయా ప్రాంతాల నుండి 165మంది బాల బాలికలు పరీక్షలు రాశారు. గుంటూరుకు చెందిన జి శ్రీనివాసరావు పరీక్ష నిర్వహించారు. హెచ్‌ఎం సిహెచ్ రామకోటేశ్వరరావు పరీక్షల చీఫ్‌గా వ్యవహరించారు. ఈ పరీక్షలకు కనగాల, గూడవల్లి, చెరుకుపల్లి, చందోలు, భట్టిప్రోలు, చావలి, పెరవలి, సూరేపల్లి గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన బాలబాలికలు

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

సత్తా చాటిన బాలబాలికలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లార్డ్ కృష్ణ ఇండోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అండర్-13 బాల బాలికల సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 231 మంది బాల బాలికల క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఆదివారం జరిగిన ముగింపు పోటీలలో బాలికల సింగిల్స్ విజేతగా డివి యజ్ఞశ్రీ(అనంతపురం), దీపాటి త్రిష (తూర్పుగోదావరి) ఉప విజేతగా నిలిచారు. బాలుర సింగిల్‌లో డివి యజ్ఞనాథ్ (అనంతపురం) విన్నర్‌గా విశాఖపట్నం కు చెందిన కె.చద్విక్(విశాఖపట్టణం) రన్నరప్‌గా నిలిచారు. బాలికల డబుల్స్‌లో డి వి.యజ్ఞశ్రీ (అనంతపురం), శ్లోక రెడ్డి(నెల్లూరు) జంట విన్నర్స్‌గా, డి విజయ తేజస్వి(పశ్చిమగోదావరి) పి.వేదిక(విశాఖపట్టణం) రన్నర్స్ గా నిలిచారు. బాలుర డబుల్స్ లో అనంతపురం కు చెందిన డి.వి యజ్ఞ నాథ్(అనంతపురం), ఆముదాల ప్రవీణ్(చిత్తూరు) విన్నర్స్ గా, కె.చద్విక్ (విశాఖపట్టణం), మహంకాళి జస్వంత్ (కర్నూలు) రన్నర్స్ గా నిలిచారు. ముగింపు వేడుకలకు కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, డి సి.బి బ్యాంక్ మేనేజర్ ఫణికుమార్, కరూర్ వైశ్య బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, లార్డ్ కృష్ణ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళి కృష్ణ మెమెంటో లు అందచేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జజెఎస్ లక్షణ రెడ్డి, లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ చైర్మన్ అద్దంకి మురళికృష్ణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పి.విజయకృష్ణ, కోశాధికారి అశోక్ రెడ్డి, రఘు బాబు, లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు టి.వి రమణ, కోడె శ్రీనివాస్, రఘుబాబు పాల్గొన్నారు.

టిటిడి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పలు అభివృద్ధి కార్యక్రమాలలో టిడిపి మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-మేదరమెట్ల

మండలంలోని మేదరమెట్ల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలలో మాజీ టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ఆదివారం పాల్గొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అక్కడే టిటిడి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన, పశువుల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన వంటి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఎస్పీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ఉన్నామని, అందుకు ప్రజలు తమ మీద చూపిస్తున్న ఆధారాభిమానాలే కారణమన్నారు. ఇంకా గ్రామానికి చేయవలసింది చాలా ఉందన్నారు. ఈ అభివృద్ధిలో భాగంగా ఇంటింటికి కులాయి పనులు కూడా ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైతన్య, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, మారం వెంకరెడ్డి, గ్రామ సర్పంచ్ బొన్నిగల ఎలిసెమ్మ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్న వైవి.సుబ్బారెడ్డి

ఉపాస్ ఆధ్వర్యంలో రక్తనాళాల వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు

లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ విజన్ వారి ఆధ్వర్యంలో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో హాస్పిటల్‌లో ఉచిత మెగా రక్త నాళాల (వెరికోస్‌వీన్స్) వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ప్రముఖ వెరికోస్ వీన్స్ వైద్యులు డాక్టర్ సురేష్‌రెడ్డి 70 మందికి పైగా వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి డాప్లర్ స్కాన్ ఉచితంగా చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఉపాస్ డైరెక్టర్లు డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ అనపర్తి శ్రీనివాసులు, డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాస్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చవల

సైన్స్ ఫలితాలను సైతం

రాజకీయాలకు ఉపయోగించుకోవడం దుర్మార్గం

జనవిజ్ఞానవేదిక మహాసభలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-చీరాల

సైన్స్ ప్రయోగ ఫలితాలను సైతం విశ్వాసాలకు ముడిపెట్టి.. రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునే దుర్మార్గమైన పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని కష్టా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. చీరాల పద్మశాలి కళ్యాణ మండపంలో నరేంద్ర దబోల్కర్ ప్రాంగణంలో రెండోరోజైన ఆదివారం జరిగిన జెవివి రాష్ట్ర 17వ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పనిచేస్తున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు ప్రధానమైన ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేసి వ్యక్తి ఆలోచనల చుట్టూ అధికారాన్ని తిప్పుకుంటూ వ్యవస్థలను నాశనం చేస్తున్నారని తెలిపారు. ఫలితంగా ప్రజల ప్రయోజనాలకు భంగం కలుగుతోందన్నారు. గ్రంథాలయాల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉండాలని, కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్య హక్కు చట్టం చేయాలని మహాసభ తీర్మానించింది. కొత్త మెడికల్ కళాశాల్లో 50 శాతం సీట్లు అమ్మకానికి పెడుతూ ప్రభుత్వం ఇచ్చిన 107, 108 జిఒలను రద్దు చేయాలని, అర్హత కలిగిన పేద విద్యార్థులకు అవకాశాలను ఆవిరి చేయడం అన్యాయమని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే కేంద్రప్రభుత్వ ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తి అయిన ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలని, ముంపు గ్రామాల ప్రజలకు వెంటనే పునరావాసం కల్పించాలని, సత్వరం నష్టపరిహారం చెల్లించాలని తీర్మానించారు. కేంద్రప్రభుత్వం ఏకరూప పౌరస్మృతి ప్రతిపాదన విరమించుకొని దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని కోరారు. విద్యార్థుల్లో అశాస్త్రీయ భావాలను వ్యాప్తికి కారణమవుతున్న నూతన విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 51(ఎ)హెచ్‌ని ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసి వైజ్ఞానిక సంస్థల్ని మూసివేసే ధోరణి మానుకోవాలని హెచ్చరించారు. భావ ప్రకటన స్వేచ్ఛ కాపాడాలని, ప్రశ్నించే హక్కును హరిస్తున్న నిరంకుశ ఉపా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక, సామాజిక అంతరాలు లేని సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఆంధ్రరాష్ట్రంలో మూఢనమ్మకాల నిర్మూలనా చట్టం చేయాలని కోరారు. చంద్రయాన్-3 విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తల బందానికి జేజేలు పలికారు. ఇస్రోను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చట్టం చేయాలని తీర్మానించారు. సభలో కర్నూలు మాజీ ఎంఎల్‌సి డాక్టర్ గేయానంద్, జెవివి రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రాహుల్, జి మురళీధర్, కె శ్రీనివాస్, కుర్రా రామారావు, ఎస్ఎన్ రమేష్, కె త్రిమూర్తులు, రిటైర్డు ప్రొఫెసర్ బోయా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జెవివి రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

జనవిజ్ఞానవేదిక రాష్ట్ర మహాసభలలో నూతన రాష్ట్ర కమిటీ 74 మందితో ఎన్నికైంది. రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా డాక్టర్ గోపాలం శివన్నారాయణ, డాక్టర్ చెలికాని స్టాలిన్, రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, నూతన అధ్యక్షులుగా డాక్టర్ యం.గేయానంద్, ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, కోశాధికారిగా బి.రాజశేఖర్ రాహుల్ ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా కె.త్రిమూర్తులు, వి.రాజగోపాల్, ఎస్.ఎన్.రమేష్, డాక్టర్ నాగరాజు, కె.వి.వి.సత్యనారాయణ, డి.బుజ్జిబాబు, తవ్వా సురేష్, సి.హెచ్. జయప్రకాష్, కె.ఎం.ఎం.ఆర్.ప్రసాద్, జి.గిరిధర్, పి.వి.గోపాలరావు, వై.ఎస్. నాగేశ్వరరావు, నిర్మల, ఎం.వి.ఎస్.శర్మ, (ఆహ్వానితులు), జి.మురళీధర్ (ఆహ్వానితులు), కె శ్రీనివాస్ (ఆహ్వానితులు), డాక్టర్ ఎస్.కె.కాలేషాసాహెబ్ (ఆహ్వానితులు)గా ఎన్నికయ్యారు.

కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ

- నిరుద్యోగ యువత ఎన్‌రోల్‌మెంట్ లక్ష్యం
- జిల్లాలో 28,719 మంది అభ్యర్థులు నమోదు
- నియోజకవర్గాల్లో మెగా జాబ్‌మేళాల నిర్వహణ
- జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్ వెల్లడి



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో నిరుద్యోగ యువతీ, యువకులను నమోదు చేయటమే లక్ష్యంగా జిల్లా ఉపాధి కార్యాలయం పనిచేస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి నెల రెండు నియోజకవర్గాల్లో మెగా జాబ్ మేళాలు, జిల్లా కేంద్రమైన ఒంగోలులో మినీ జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, స్టెప్ వంటి సంస్థలతో కలసి నిరుద్యోగ యువత నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. నిరుద్యోగ యువతకు కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వివరించారు. జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా నిరుద్యోగ యువతకు అందిస్తున్న కార్యక్రమాలను ప్రజాశక్తికి వివరించారు. ఆ వివరాలన్నీ ఆయన మాటల్లోనే...

జిల్లాలో టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంఫిల్ వంటి కోర్సులు పూర్తి చేసిన వారి విద్యార్హతలను జిల్లా ఉపాధి కార్యాలయంలో నమోదు చేసి ఎంప్లాయిమెంట్ కార్డు అందిస్తున్నాం. ఈ కార్డు నిరుద్యోగ యువతీ, యువకులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు పొందేందుకు దోహదపడుతోంది. ఇటీవల కాలంలో ఎంప్లాయిమెంట్ చేయించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. ఆప్కాస్ ద్వారా ఉద్యోగాలు పొందే అభ్యర్థులకు సైతం ఎంప్లాయిమెంట్ చేయించుకోవటం తప్పనిసరి కావటంతో వారంతా ఎంప్లాయిమెంట్ చేయించుకోవటానికి వస్తున్నారు. దీంతో వస్తున్న అభ్యర్థులకు అనుగుణంగా ఏర్పాట్లు చేసి వారికి ఎంప్లాయిమెంట్ కార్డులు అందిస్తున్నాం.

జిల్లాలో 28,719 మంది నమోదు

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నిరుద్యోగ యువత 28,719 మంది నమోదయ్యారు. వీరిలో పురుషులు 22,059, మహిళలు 6660 మంది ఉన్నారు. పదో తరగతి లోపు అభ్యర్థులు 969 మంది, పదో తరగతి అభ్యర్థులు 13,004, ఇంటర్ అభ్యర్థులు 6,995, డిగ్రీ అభ్యర్థులు 7,740 మంది, పిజి, ఎంఫిల్ చేసిన అభ్యర్థులు నలుగురు ఉన్నారు.

మెగా జాబ్ మేళాల నిర్వహణ

కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాం. ప్రతి నెల రెండు నియోజకవర్గాలలో మెగా జాబ్ మేళాలు జరిపేలా ప్రణాళికలు రచించాం. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఆగస్టు వరకు 12 జాబ్ మేళాలు, 24మినీ జాబ్ మేళాలు జరిపాం. ఒంగోలు నియోజకవర్గంలో 3, యర్రగొండపాలెం నియోజకవర్గంలో 2, కనిగిరి నియోజకవర్గంలో 2, మార్కాపురం నియోజకవర్గంలో 1, సంతనూతలపాడు నియోజకవర్గంలో 2, దర్శిలో 2 మెగా జాబ్ మేళాలు నిర్వహించాం. ఒంగోలులో మినీ జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాం. సేల్స్, సర్వీస్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఫైనాన్స్, చిట్‌ఫండ్స్, రియల్ ఎస్టేట్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్‌లో ఖాళీ పోస్టులకు జాబ్ మేళాలు జరుపుతున్నాం.

కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

నిరుద్యోగ యువత కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, నెహ్రూ యువ కేంద్ర, స్టెప్ వంటి సంస్థలతో కలసి 8, 9, 10, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇస్తున్నాం. ఇటీవల నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో నిరుద్యోగుల సర్వే జరిగింది. ఇందులో ఉన్న వారి అభిరుచులను బట్టి వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాం. ఆయా సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయనున్నాం. రానున్న కాలంలో వివిధ సంస్థల సహకారంతో నిరుద్యోగ యువతీ, యువకులకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలలో భాగస్వాములవుతాం.